రాజీవ్ యువ వికాసం మంజూరు చేయాలి

మల్కాజిగిరి, మే 23: రాజీవ్ యువ వికాసం పథకం అందరికీ మంజూరు చేయాలని మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లికార్జున్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అందరికీ మంజూరు చేయాలన్నారు. ఎంపిక ప్రక్రియలో లబ్ధిదారులకు ఎలాంటి పక్షపాతం లేకుండా, షరతులు లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత యాదవ్, జేఏసీ వెంకన్న, హన్మంత్‌రావు, రాము యాదవ్, భాగ్యానంద్, మధుసూదన్ రెడ్డి, సతీశ్, జనార్దన్, బంటి, రాజు, రాజశేఖర్ రెడ్డి, నర్సింగ్, బాబురావు, నవీన్, కోటేశ్వర్,సురేశ్, కృష్ణ గౌడ్, బాలకృష్ణ, ఉమేశ్, నర్సింగ్,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సబ్ జూ.అథ్లెటిక్స్ పోటీలు

ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్

జవహర్‌నగర్, మే 23: తెలంగాణ క్రీడా పాఠశాల హకీంపేట్‌లో మేడ్చల్ జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు బాలబాలికలకు నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు. ఆసక్తిగల 14ఏండ్ల లోపు క్రీడాకారులు తమ పుట్టినరోజు సర్టిఫికెట్‌తో ఈ నెల 25వ తేదీ ఆదివారం తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల ప్రాంగణంలో 3గంటల వరకు ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్‌కు రిపోర్ట్ చేయాలని తెలిపారు. పరుగుపందెం, జంపింగ్, త్రోయింగ్ ఆటలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చే క్రీడాకారులు 14వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఎంపికవుతారన్నారు. మరింత సమాచారం కోసం 98496 12733ని సంప్రదించాలని కోరారు.

టీజేఎఫ్ రజతోత్సవాలను జయప్రదం చేయండి

టీయూడబ్ల్యూజే కార్యదర్శి గుండు ముత్తయ్య

నేరేడ్‌మెట్‌లోని కార్యాలయంలో టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్కాజిగిరి, మే 23: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన టీజేఎఫ్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని కార్యాలయంలో మే 31న జలవిహార్‌లో టీజేఎఫ్ జరిగే రజతోత్సవాల పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అమర్, మల్కాజిగిరి సర్కిల్ అధ్యక్షుడు జార్జ్ విల్సన్, ప్రధాన కార్యదర్శి గిరిగౌడ్, మురళీ యాదవ్, వెంకట రమణ నాయుడు, అక్కల రాజేందర్ గౌడ్, దూశెట్టి పాండు గౌడ్, మనోజ్ గౌడ్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు లేవు.. సూచనలు లేవు



సూచిక బోర్డులు లేక ఖాళీగా ఉన్న కార్యాలయంలోని విభాగాలు

చైర్మన్ చాంబర్ పేరుతో టౌన్ ప్లానింగ్ విభాగం ప్రధాన ద్వారం

ఉప్పల్, మే 23 : సమాచారం కోసం వచ్చే ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. కార్యాలయానికి వచ్చే వారికి విభాగాల పేర్లు, విభాగాలు తెలియక తికమక పడుతున్నారు. కార్యాలయంలో పనుల కోసం వచ్చే వారు ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో సూచిక బోర్డులు లేక ప్రజలు అవస్థలు తప్పడం లేదు.

నిత్యం వందల సంఖ్యలో కార్యాలయానికి ప్రజలు..

జీహెచ్ఎంసీ పరిధిలోని ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో పలు విభాగాలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు వాటికి కార్యాలయాల పేర్లతో కూడిన సూచిక బోర్డు లేకపోవడం ఇబ్బందిగా మారింది. వీటికి తోడు ఇంజినీరింగ్ టౌన్, ప్లానింగ్, డీసీ చాంబర్, రెవెన్యూ సెక్షన్, యూసీడీ, శానిటేషన్, ట్యాక్స్ రిసెప్షన్, తదితర విభాగాల పనుల కోసం వచ్చేవారు తికమక పడుతున్నారు. అక్కడికి వచ్చి ఈ కార్యాలయం ఎక్కడ ఉన్నది? అంటూ ఆరా తీస్తున్నారు. ఎటు వెళ్లాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. గత కొన్నేండ్లుగా వీటిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టకపోవడం గమనార్హం.

చైర్మన్ చాంబర్ పేరుతో టౌన్ ప్లానింగ్ విభాగం

ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి గతంలో మున్సిపాలిటీగా ఉన్న కాలంలో చైర్మన్ చాంబర్‌గా ఉన్న విభాగం కేటాయించారు. అయితే ఇప్పటికీ చైర్మన్ పేరుతోనే విభాగం ఉన్నది. ఇప్పటివరకు ఎలాంటి సూచిక బోర్డు పెట్టకపోవడం వీరి పనితీరుకు అద్దం పడుతున్నది. వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి కార్యాలయం ఎక్కడుందో తెలియక పలువురిని అడుగుతూ కనిపించడం ప్రతిరోజు దినచర్యగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులోకి మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్

మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ డిజైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి,జోనల్ కమిషనర్

మల్లాపూర్, మే 23: మీర్పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని బండబావి ప్రాంతంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసేందుకు శుక్రవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించారు. మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ చివరిదశ డిజైన్‌ను జోనల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..బండబావి ప్రాంతంలో మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి కావాల్సిన డిజైన్ ప్రణాళిక రావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ డిజైన్‌ను పరిశీలించి, త్వరలోనే ఈ పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. అనంతరం డివిజన్ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ..బండబావి ప్రాంతంలో మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి కృషి చేస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్, ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ప్రణాళిక ప్రకారం.. పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేందర్, యూబీడీ డైరెక్టర్ అన్నపూర్ణ, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, శ్రీనివాస్, డిజైన్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాసరెడ్డి, వంజరి ప్రవీణ్ కరిపే, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, ఉల్లెం బాలరాజు, సాయికుమార్, నిసార్ అహ్మద్ గోరి, వేణుగౌడ్, వాసుచారి, మధు, దండెం నరేందర్, నరసింహ గౌడ్, సంజయ్ నాయక్, శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ విజయ కుమారి

ఉప్పల్, మే 23 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఐదు రోజుల మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాధికారి విజయ కుమారి శుక్రవారం జడ్పీహెచ్ఎస్ ఉప్పల్ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విజయ్ కుమారి మాట్లాడుతూ.. మారుతున్న కాలానుసారంగా ఉపాధ్యాయుల కొరతను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించుకొని ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరచడం కోసం ఈ వేసవిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణా సమయంలో మీరు పొందిన జ్ఞానాని తరగతిలో అమలు చేసి, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల కోసం కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు రూపొందించిన డిజిటల్ నివేదికను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామారావు, జెడ్పీ హెచ్ఎస్ ఉప్పల్ ప్రధాన ఉపాధ్యాయులు అశోక్, ఉప్పల్ మండల ఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్, మే 23: ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని విద్యార్థులకు బోధన, అభ్యసన సామర్థ్యాలను సాధించాలని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి విజయ కుమారి తెలిపారు. ఘట్‌కేసర్ మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జరుగుతున్న వృత్యంతర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ కుమారి పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేయాలని, శిక్షణలో భాగంగా నేర్చుకున్న విషయాలను పాఠశాల తరగతి గదిలో పాటించాలన్నారు. విద్యార్థులకు తరగతుల వారీగా బోధన అభ్యసన సామర్థ్యాలను సాధించాలని చెప్పారు. శిక్షణ కార్యక్రమాలు పాఠశాల ఉపాధ్యాయుల నైపుణ్య అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ఆర్థిక స్థోమత లేకున్నా ప్రైవేటు పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులను చైతన్యపరిచి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు, అర్హతలను తెలియజేసి ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంలో అలసత్వం వహిస్తే చర్యలు

అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్ కలెక్టర్, మే 23: రాజీవ్ యువ వికాసం పథకం అమలులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, అధికారులు సమష్టిగా పని చేసి అమలు లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం అమలు ప్రగతిపై కలెక్టరేట్‌లో ఆమె శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మున్సిపాలిటీ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేషన్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ..అధికారులు బ్యాంకులను సమన్వయం చేసుకొని, అర్హులందరికీ పథకం అమలయ్యేలా చూడాలన్నారు. పథకం అమలుపై సీఎం రోజువారీగా సమీక్ష నిర్వహిస్తున్నందున నిర్ణీత సమయంలో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, జడ్పీ సీఈవో సాంబశివరావు, గిరిజన అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీరాణి, లీడ్ బ్యాండ్ జిల్లా మేనజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ గురుకులాల ఎత్తివేతను వెనక్కి తీసుకోవాలి

మాట్లాతున్న ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అనిల్

ఘట్‌కేసర్, మే 23: రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 12 గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలను ఎత్తివేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు చింతల అనిల్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గురుకుల కళాశాలల ద్వారా పేద, బడుగు బలహీన, అణగారిన వర్గాల విద్యార్థులకు ఇంటర్ విద్య అందుతుందన్నారు. నేడు కార్పొరేట్ కళాశాలలు లక్షల రూపాయల ఫీజులు వసూళ్లు చేస్తున్న నేపథ్యంలో ఈ గురుకులాలు పేద విద్యార్థులకు ఆసరాగా ఉన్నట్లు చెప్పారు. అలాంటి వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేయడం ద్వారా వేల సంఖ్యలో విద్యార్థులకు చదువు భారం అయ్యే అవకాశాలు ఉన్నందున ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకొని ఈ గురుకులాలను కొనసాగించాన్నారు. లేని యెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ మృతి

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన లింగం

మేడ్చల్, మే 23 : ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా.. కరెంట్ షాక్‌కు గురై ఓ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్వెల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం..మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లికి చెందిన దుండిగళ్ల లింగం(53) ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు అత్వెల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కన వెంచర్‌గా అభివృద్ధి చేస్తున్న స్థలంలో ఉన్న తాత్కాలిక నివాసాలకు కరెంట్ రాకపోవడంతో సంబంధికులు ఫోన్ చేశారు. లింగం మీటర్‌ను పరిశీలించిన అనంతరం త్రీఫేజ్ కరెంట్‌కు ఒక ఫేజ్ కరెంట్ రావడంలేదని గుర్తించాడు. ఆ స్థలం ప్రహరీకి ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద త్రీఫేజ్ కోసం కనెక్షన్ ఇవ్వడానికి పైకి ఎక్కాడు. గతంలో తనకు విద్యుత్‌శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసిన అనుభవం ఉన్న కారణంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. కనెక్షన్ ఇస్తుండగా కాలుకు విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్ వద్దే మృతి చెందాడు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ రూరల్ ఏఈ మౌలాలి ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఏఈని ఘటన గురించి వివరణ కోరగా.. ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవో మరమ్మతు చేస్తుంటే కరెంట్ ట్రిప్పు అయ్యింది. తమ సిబ్బంది వచ్చి ఫ్యూజ్ వేసే వరకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి పనులు చేయొద్దని లింగంను హెచ్చరించినట్టు తెలిపారు. అయినా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వచ్చి కరెంట్ షాక్‌కు గురయ్యాడని తెలిపారు. లింగం భార్య భాగ్యమ్మతోపాటు బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలిసి పిలిచిన వారు ఘటనా స్థలం నుంచి పరారయ్యారు. ఎస్సై మన్మథరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై సమాచారాన్ని సేకరించారు.

స్టార్మ్‌వాటర్ డ్రెయిన్ పనులు వేగవంతం చేయండి

కాప్రా చెరువు చుట్టూ కలియ తిరిగిన జోనల్ కమిషనర్ హేమంత్

కాప్రా చెరువు వద్ద కొనసాగుతున్న స్టార్మ్‌వాటర్ డ్రెయిన్ పనులను పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా కార్పొరేటర్ స్వర్ణరాజు, డీసీ జగన్‌తో మాట్లాడుతున్న జడ్సీ హేమంత్ కేశవ్

కాప్రా, మే 23: కాప్రా చెరువులోకి వర్షపునీటిని చేర్చే ఈశ్వరిపురి, క్లాసిక్ ఎంక్లేవ్ స్టార్మ్‌వాటర్ డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ కాప్రా సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కాప్రా డివిజన్ పరిధిలోని కాప్రా చెరువును కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజు, కాప్రా, మల్కాజిగిరి ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించారు. చెరువు సమీపంలో ఉన్న ఈశ్వరిపురి కాలనీ నుంచి మైత్రి ఎంక్లేవ్ వరకు చెరువు బండ్ మీదుగా కాలినడకన చెరువు చుట్టూ తిరిగారు. చెరువు పరిసరాలు, చెరువు వద్ద నెలకొన్న సమస్యలను ఆయన స్వయంగా చూసి, అధికారులతో చర్చించారు. ఈశ్వరిపురి, క్లాసిక్ ఎంక్లేవ్‌లు వాటి పరిసర కాలనీల నుంచి వచ్చే వర్షపునీటిని చెరువులోకి తరలించేందుకోసం నిర్మిస్తున్న స్టార్మ్‌వాటర్ డ్రెయిన్ పనులను జడ్సీ పరిశీలించారు. డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలనీ, రానున్న వర్షాకాలంలో డ్రెయిన్‌ల ద్వారా వచ్చే వర్షపు నీరు చెరువులో నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలని, చెరువు పరిసరాల్లో మొక్కల పెంపకం చేపట్టాలని జడ్సీ సూచించారు. అలాగే చెరువునీరు బయటకు వెళ్లకుండా వాల్వులకు మరమ్మతులు చేయాలనీ, లీకేజీలను అరికట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కాప్రా చెరువుకు పూర్వవైభవం చేకూరేలా తగిన చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులకకు ఆదేశాలు జారీ చేయాలని కాప్రా లేక్ రివైవల్ గ్రూప్ ప్రతినిధి మనోజ్ఞారెడ్డి, ఇతరులు జడ్సీకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, కాప్రా తహసీల్దార్ సుచరిత, ఈఈ నాగేందర్, డీఈఈ బాలకృష్ణ, ఏఈ సూరజ్, కాప్రా, మల్కాజిగిరి సర్కిల్ అధికారులు , కాప్రా లేక్ రివైవల్ గ్రూపు ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్, శాస్త్రవేత్తలు

మేడ్చల్, మే 23: కూరగాయల సాగుతో అధిక లాభాలు అర్జించవచ్చని జిల్లా ఉధాన్య అధికారి శ్రీధర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, డాక్టర్ సురేశ్, నిరోషా అన్నారు. మూడుచింతలపల్లి మండల రైతు వేదికలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై మంచి వ్యవసాయ పద్ధతులపై ఒక రోజు రైతు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయల సాగులో సరియైన యాజమాన్య పద్ధతులను అవలంభిస్తే అధిక లాభాలు అర్జించవచ్చని తెలిపారు. రైతులు అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు పాటిస్తూ సాగు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు, కీటకాలు, తెగుళ్లు, నివారణపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి, మండల మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, నేట ఫిమ్ ఆగ్రోనామిస్ట్, సుబ్బారావు, జీడిమెట్ల హార్టికల్చర్ అధికారి శ్రీ జలంధర్, మండల వ్యవసాయ అధికారి శ్రీ రవికుమార్, మండల ఉద్యాన అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్ గౌడ్, మూడుచింతలపల్లి, అద్రాస్‌పల్లి, అనంతారం, ఉద్దెమర్రి, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రెండు కాలనీలకు రోడ్డు సౌకర్యం

మేడ్చల్, మే 23: కమిషనర్ చొరవతో తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ తిరుమల కాలనీ రోడ్డు సమస్య తీరింది. తిరుమలకాలనీ, ఎస్సీ కాలనీ మధ్యలో ఉన్న ప్రహరీ విషయం కొంతకాలంగా వివాదం నడిచింది. అయితే కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు సమస్యను పరిశీలించిన కమిషనర్ వెంకటగోపాల్ మున్సిపాలిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నారు. శుక్రవారం కమిషనర్ ఆదేశాల టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ జేసీబీ సాయంతో తిరుమల కాలనీకి రోడ్డుకు అడ్డంగా ఉన్న ప్రహరీని తొలగించారు. దీంతో రెండు కాలనీలకు దారి సుగమం అయింది.

పెద్ద నాలా పూడిక తీత పనులు

రామంతాపూర్, మే 23: నాచారం పెద్దనాల నుంచి పూడిక తొలగింపు పనులు ఈ సంవత్సరం చాలా బాగా జరిగాయని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులను శుక్రవారం కాంట్రాక్టర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎన్నడూలేని విధంగా పెద్దనాల నుంచి గుట్టలు గుట్టలుగా పూడిక వంద శాతం తీయడం జరిగిందన్నారు. తీసిన పూడిక రోడ్లపై ఉండటంతో ఈ రోడ్డు గుండా వెళ్లే వారికి, అలాగే నాలా పక్కన ఉండే వ్యాపారస్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, దుర్వాసన వస్తుందని తొందరగా మట్టి కుప్పలు ఇక్కడి నుంచి తరలించాలన్నారు. త్వరితగతిన తీసిన బురద మట్టిని ఇక్కడి నుంచి తరలించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాయిజన్ శేఖర్, సంఘం యాదగిరి కట్ట బుచ్చన్న గౌడ్, లక్ష్మణ్,కిట్టు, యాకి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అదనంగా 20 రౌండ్ల ట్రిప్పులు

30 మంది ఉంటే కాళేశ్వరానికి ప్రత్యేక బస్సు

కాప్రా, మే 23 : చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణీకులకు అదనపు ఆర్టీసీ బస్సుల సౌకర్యాన్నిఏర్పాటు చేస్తున్నట్టు కుషాయిగూడ డిపో మేనేజర్ మహేశ్‌కుమార్ తెలిపారు. అఫ్జల్‌గంజ్ నుంచి నాచారం మీదుగా చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు 252 రూట్‌లో 20 రౌండ్ ట్రిప్పులను ఉదయం 3.30నుంచి ప్రతి 30నిమిషాలకు ఒకటి చొప్పున, చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ (17హెచ్)ఈసీఐఎల్, తార్నాక మీదుగా 4 రౌండ్ ట్రిప్పులను ఉదయం 3.30, 4.40, 6.00, 9.00 గంటలకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి నేరేడ్‌మెట్, బాలానగర్, బోయిన్‌పల్లి మీదుగా పటాన్‌చెరువుకు(రూట్ నంబర్ 24ఎన్/219) ఉదయం 4.10,5.20,6.30లకు మూడు ట్రిప్పులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఈసీఐఎల్-ఘట్కేసర్ రూట్‌లో...

ఈసీఐఎల్-ఘట్కేసర్(281)రూట్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగిన దృష్ట్యా ప్రస్తుతం నడిచే 106 రౌండ్ ట్రిప్పులకు అదనంగా 27ట్రిప్పులు పెంచి మొత్తం 133ట్రిప్పులకు పెంచినట్లు తెలిపారు. గతంలో ఉన్న 12 బస్సులకు అదనంగా ఐదు బస్సులు పెంచామన్నారు. ఈసీఐఎల్ నుంచి మొదటి బస్సు ఉదయం 5.25లకు చివరి బస్సు రాత్రి 22.30గంటలకు, ఘట్కేసర్ నుంచి మొదటి బస్సు ఉదయం 5.00 గంటలకు, చివరి బస్సు రాత్రి 22.20 గంటలకు ఐదు నిమిషాల ఫ్రీక్వెన్సీలో నడుపుతామని తెలిపారు. ప్రస్తుతం నడిచిన 10 నిమిషాల ఫ్రీక్వెన్సీని తగ్గించి 5 నిమిషాలకు చేశామన్నారు. అలాగే మూడు మెట్రో డీలక్స్ బస్సులను ఘట్కేసర్ నుంచి అఫ్జల్‌గంజ్ వరకు మొత్తం 12 ట్రిప్పులు నగదు ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతున్నామని డీఎం కోరారు.

కాళేశ్వరం వెళ్లే 30 మంది ప్రయాణికులకు ప్రత్యేక బస్సు

కుషాయిగూడ డిపో నుంచి కాళేశ్వరం వెళ్లే ప్రయాణికులకు స్పెషల్ బస్సులు నడుస్తున్నాయని డిపో మేనేజర్ తెలిపారు. 30 మంది ఉంటే ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని, ఈ బస్సు సౌకర్యం కోసం 9110505820 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని డీఎం కోరారు.

జీపీవో పరీక్షకు ఏర్పాట్లు పూర్తి: జిల్లా కలెక్టర్

మేడ్చల్, మే 23(నమస్తే తెలంగాణ): గ్రామపాలనాధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కూకట్‌పల్లిలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 25న గ్రామపాలన అధికారి పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 52మంది అర్హులైన వీఆర్వోలు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం 1:30గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9:30నుంచి 10 గంటల వరకు మ